కథానిక :

# "వసంత"

రచన:
శ్రీ ఎల్. శేషగిరిరావు

అస్తమిస్తున్న సూర్యుని రుధిరవర్ణ కాంతులు నదీజలాల్లో ప్రతిఫలిస్తున్నాయి. తెల్లటి యిసుక మెరుస్తోంది. చాకలివాళ్లు ఆరవేసిన బట్టల్ని పోగుచేసుకొంటున్నారు. ఇసుకలో కూర్చున్న నేను ఆ దృశ్యాన్ని ఆసక్తితో తిలకిస్తున్నాను. నది ఒడ్డున ఉన్న ఆలయం ధ్వజస్తంభంమీది చిరుగంటలు గాలికి మెల్లగా మ్రోగుతున్నాయి. ఆ దృశ్యమంతా ఆహ్లాదంతో నిండి ఉన్నా నా హృదయం విచారమగ్నం కావడంచేత కాబోలు, ఆ సౌందర్యమంతా విషాదభరితంగానే కనిపిస్తోంది. అస్తమిస్తున్న సూర్యుడు లోకాన్ని వదలి వెళ్తున్నాననే విచారంచేత కాబోలు దుఃఖిస్తున్నట్టుంది. నదిలో నీరు విషాదంతో బరువుగా కదులుతున్నట్లుంది. నాదృష్టి అలా ఆలయం ప్రహారీ ప్రక్కనే ఉన్న చెట్టువైపుకు మరలింది. ఆ చెట్టును చూసేసరికి అయిదేళ్ళ నాటినాజీవితం స్మృతిపథంలో మెదిలింది.

ఆరోజే బి. ఏ. ఫైనల్ పరీక్షలురాసి ఊరికివచ్చాను. ప్రతిసారి ఊరికి వచ్చినప్పుడల్లా నేవచ్చేసరికి వాకిట్లోనే ఎదురొచ్చే పక్కింటి వసంత ఈమారు కనిపించలేదు. ఆశ్చర్యమేసింది. అయినా వయసొచ్చిందికదూ సిగ్గు కాబోలు! ఇంటి వాతావరణంలో మార్పేమీలేదు. కాని నా పెండ్లి ప్రయత్నం జరుగుతున్నట్లు కన్పించింది.

సాయంత్రం వరకు విశ్రాంతి తీసుకొని అలా ఊళ్లోకి బయలుదేరాను. కనపడ్డ ప్రతివారూ 'ఏంబాబూ! ఎప్పుడురావటం?' అనే ప్రశ్న అడగటమూ, "ఉదయాన్నే" అని జవాబియ్యటమూ మామూలుగానే జరిగిపోయాయి.

నేరుగా మిత్రుడు రవి యింటికి చేరుకున్నాను.

"లేరు ఊరికెళ్ళారు.... రేపు ఉదయం వస్తారు" అన్న జవాబులో నది వొడ్డుకి బయలుదేరాను.

ఇపుడుకనిపించిన చెట్టుక్రిందే కూర్చుని పిచ్చికగూళ్ళు కడుతున్నాను. మనస్సు ఏవేవో పిచ్చి ఊహల్లో విహరిస్తోంది.

ఇంతలో వెనుకనుంచి బరువుగా అడుగుల చప్పుడు వినిపించింది. వెనక్కు తిరిగి చూశాను. వసంత తలవంచుకుని మెల్లగా వస్తోంది.

ఆమెని చూడగానే లేచి నిలబడ్డాను.

"రా వసంతా! కూర్చో! ఏం ఈరోజు మా యింటికి రాలేదే? వస్తానని తెలీదా!"

ఇద్దరమూ కూర్చున్నాం. వసంత తలవొంచుకునే మాటాడింది.

"తెలుసు.... అక్కమ్మత్తయ్య చెపుతూంటే విన్నాను."

నాకు ఆశ్చర్యమేసింది ఏమిటది? ఏనాడూ నా ముందు అభినయించి ఎరుగని సిగ్గు ఈనాడు ప్రదర్శిస్తోంది. కుడిచేత్తో గడ్డం పట్టుకుని ముఖం పైకెత్తాను.

ఆమె కళ్ళు అప్పుడే వర్షించబోయే మేఘాల్లాగున్నాయి. ఆమె ముఖంలో విషాదరేఖలు తాండవిస్తున్నాయి. పొంగి వచ్చే దుఃఖాన్ని దిగమ్రింగుకుంటున్నది. అదరుతూన్న పెదిమని మునిపంటి నొక్కిపట్టింది. నా హృదయంలో ఎవరో చెయ్యిపెట్టి కెలికినట్లయ్యింది. మనస్సు ఆందోళనతో నిండిపోయింది.

"ఏమిటది వసంతా! ఎందుకేడుస్తున్నావ్? కారణం చెప్పు"

వసంత మౌనంగా ఉండిపోయింది.

బుజ్జగింపుగా "చెప్పు వసంతా! నా దగ్గర దాపరిక మెందుకు?" అన్నాను.

"ఏమని చెప్పను మధూ! నా జీవితం సుడిగుండంలా తయారయ్యింది. నా జీవన లత పెనవేసుకొన్న వృక్షాన్ని నా నుంచి వేళ్ళతో సహా పీకి వెయ్యడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి" ఇక ఆపైన చెప్పలేకపోయింది. గొంతు దుఃఖంతో పూడిపోయింది.

నాకేం అర్థంకాలేదు ఓదార్పుగా —

"కొంచెం విపులంగా చెప్పు వసంతా! నా కేమాత్రం అర్థం కావటం లేదు" అన్నాను.

ఆశ్చర్యంతో తలెత్తి చూచింది.

"అయితే మీ నాన్న నీకింకా చెప్పలేదా?" అంది.

"ఏమని?"

"అయితే నీకింకా తెలీదన్నమాట. మా నాన్న నన్ను నీకిచ్చి పెళ్ళిచేద్దామని మామయ్య దగ్గరకొచ్చి అడిగారు. మీ నాన్న కట్నం విషయంలో శక్తికిమించి అడిగారు. మా నాన్న ఎంత బ్రతిమాలినా మీ నాన్నగారు కనికరించలేదు. ఇక చేసేదిలేక నాన్న వేరే సంబంధాలు వెతుకుతున్నారు. నాకేం పాలుపోవటం లేదు. చిన్నప్పట్నుంచి ఒకచోట పెరిగాం. మన మనస్సులు రెండూ ఒకటిగా పెనవేసుకుపోయాయి. నా జీవన లతకి నీవే ఆధారమనుకొన్నాను. భవిష్యత్తును గూర్చి మధుర స్వప్నాలు కన్నాను. ఎన్నో ఊహాసౌధాలు నిర్మించుకొన్నాను. ఇపుడా కలలన్నీ కల్లలైతే నేనెలా బ్రతగ్గలను? మధూ! మనసొకచోట మనువొకచోట అయితే ఎలా బ్రతికేది? నీకంకితం చేద్దామని నిశ్చయించుకొన్న నా దేహాన్ని మరొకరికెలా అర్పించేది." అని ఆవేశంతో ఆగిపోయింది.

నేను కలగంటున్నానా? లేక వాస్తవమేనా? ఏమిటది? నాన్న అంత కఠినంగా ఎలా ప్రవర్తించాడు? ఇంత ఆస్తికి ఏకైక వారసుడ్నైన నాకు కట్నం కోసం కాచుక్కూర్చో వలసిన అవసరం ఏమొచ్చింది? నాకేం బోధపడలేదు. ఏం మాట్లాడాలో తోచడం లేదు. మౌనంగా కూర్చున్నాను.

దుఃఖాన్నాపుకొని ఓమారు నా కళ్ళల్లోకి చూసింది. ఆ కళ్ళల్లోని నైర్మల్యమూ, దివ్య ప్రేమా చూస్తూ అలాగే ఉండి పోయాను. తల క్రిందికి దించుకొంది.

"మధూ! అడగవలసిన దాన్ని కాదు. కాని.... సిగ్గు విడిచి అర్థిస్తున్నాను" అని ఆగింది.

నేను తదేకంగా ఆమె వైపే చూస్తున్నాను. చేతితో ఇసుకలో ఏవో గీతలు గీస్తూ ప్రారంభించింది.

"నీవయినా నా జీవితాన్ని నిలపడానికి యత్నించు మధూ! నే నెపుడూ నీ దాన్నే. నా జీవితమూ, నా సర్వస్వమూ నీకేనాడో అర్పించేశాను. బాల్యం నుండీ పెంచుకొన్న మమతలన్నీ నేడు తుంచివేయలేను. మీ నాన్నని ఒప్పించడానికి ప్రయత్నించు. ఆయన అంగీకరించకపోయినా నీ వసంత ఇంకొకరి సొత్తు కాలేదు. మన వివాహమే జరక్కపోతే నీ వసంత నింక చూడలేవు." అని లేచి ఉద్వేగంతో వెళ్ళిపోయింది,

మనస్సు చిమ్మ చీకటైపోయింది. వసంతని విడిచి నే బ్రతకగలనా? ఆ మిల మిల మెరిసే కళ్ళలోని కాంతులే నా జీవితానికి వెలుగుబాటలను కున్నాను. అవి లేకపోతే నా భవిష్యత్తు గాఢాంధకారం అయిపోదూ? హృదయం వ్యథాపూరితం అయిపోయింది. కర్తవ్యమేమిటో బోధపడలేదు.

అలా ఆలోచనల్లో ఎంతసేపు గడిపానో? బాహ్యస్మృతిలో కొచ్చేసరికి నా మనస్సులో లాగే బయట కూడా బాగా చీకటిపడింది.

మెల్లగా లేచి బయలుదేరాను.

ఇంటికెళ్ళేసరికి నాన్న వసారాలో కూర్చుని ఉన్నారు,

'ఏరా? ఇంతసేపూ ఎక్కడికెళ్ళావ్?' అన్నారు.

మౌనంగా లోపలికి నడిచాను. ఆయన ఆశ్చర్యంతో లేచి లోపలికొచ్చారు. నా ముఖంలోకి చూసి.

"ఏరా? అలా ఉన్నావ్. ఏం జరిగింది!" అన్నాడు.

"వసంతని నాకిచ్చి వివాహం చేయ చేయటానికి ఒప్పుకోలేదట"

ఆయన చిరునవ్వు నవ్వి "మరి! బి. ఏ. చదివినవాడికి రెండు వేలు కట్నం యిస్తానంటే ఎలాగోయ్? మనం పెట్టిన డబ్బన్నా రాబట్టుకోవాలిగా?.... అయినా నీ కెందుకు? చూస్తూండు ఆ అమ్మాయిని మించిన అందగత్తెను నీకు వివాహం చేస్తాను" అన్నారు.

నవ్వువుండింది. కంఠం వరకు వచ్చిన కోపాన్ని దిగమింగి,

"అక్కర్లేదు. నేను వసంతనే వివాహం చేసుకుంటాను"

"నీకేమైనా పిచ్చిపట్టుందా ఏమిటి? కట్నం అనువేలకు దమ్మిడీ తగ్గినా నే నొప్పుకోను. అంతా నీ యిష్టమేనా ఏమిటి? పెంచి పెద్దచేసిన నా యిష్టం అక్కరలేదూ?"

"అసలు నాకు కట్నం తీసుకోవడం యిష్టంలేదు. చిన్నప్పట్నుంచి ప్రేమించుకున్న మమ్మల్ని కట్నం కోసం విడగొట్టటం నేను సహించను. జీవితంలో నే నెవర్నన్నా పెళ్ళిచేసుకోవడం సంభవిస్తే అది వసంతనే" అని చెప్పి గిరుక్కున వెనుదిరిగి గదిలో కెళ్ళి తలుపులు బిగించేసాను.

అమ్మ తలుపు తట్టటం వినిపించింది. మౌనం వహించాను విసుగెత్తి తలుపు తట్టడం మానేసి వెళ్ళిపోయింది....

మంచంమీద పడుకొని ఆలోచనలో మునిగిపోయాను. ఎపుడు నిద్ర పట్టిందో మెలకువ వచ్చేసరికి బాగా పొద్దెక్కింది. లేచి తలుపు తీశాను.

'నీ పట్టే నెరవేరిందిరా మధూ! మీ నాన్న మీ పెళ్ళికి ఒప్పుకొని మాట్లాడ్డానికి వాళ్ళింటికెళ్ళారు" అంది అమ్మ.

'ఎంత మంచివాడు నాన్న! అనుకొన్నాను. మనస్సు సంతోషంతో నిండిపోయింది, హృదయం పరవళ్ళు తొక్కింది. కులాసాగా కార్యక్రమాల్లో మునిగిపోయాను.

వివాహం వైభవంగా సాగిపోయింది. అయిన వారానికే రిజల్టు వచ్చాయి పరీక్ష పాసయ్యాను. అందరూ అంతా వసంత అదృష్టం అన్నారు. జీవితం పూల పాన్పులా కనిపించింది.

కాని ఎల్లప్పుడూ ఒకే లాగుండటం అసంభవం గదా? వివాహం జరిగిన రెండేళ్ళకి వసంత గర్భం దాల్చింది. నవ మాసాలూ మోసి చక్కటి పిల్లవాణ్ణి కని నా వడిలో పడేసి శాశ్వతంగా కనుమూసింది.

హృదయం శూన్యమైపోయింది. జీవితం అంధకారమయింది. భవిష్యత్తు అగమ్యంగా కనిపించింది. బ్రతుకు అర్థహీనంగా తోచింది. వసంతలేని నా జీవితం ఎందుకు? ఏం సాధించాలి?

మూడునాళ్ళ ముచ్చటై ముగిసింది నా సంసారం. భవిష్యత్తుకోసం కన్న కలలన్నీ కల్లలయ్యాయి. కంటకావృతమైన బ్రతుకు బాటలో పయనానికి నాకిక తోడులేదు. మూడు రోజులలాగే నిద్రాహారాలులేక ఇంటిపైకేసి చూస్తూ ఉండి పోయాను,

వారం రోజులయ్యాక వసంతని మరచి పోవడానికి ప్రయత్నించాను. కాని కృతకృత్యుణ్ణి కాలేకపోయాను కొడుకు ముఖంలో వసంత చిరునవ్వు ప్రత్యక్షమయ్యేది. కాలం మెల్లిగా గాయాన్ని పూర్తిగా కాకపోయినా కొంతవరకు మాన్పగలిగింది. ఇలా బరువుగా ఓ సంవత్సరం గడచిపోయింది.

ఓనాడు నాన్న పునర్వివాహం గూర్చి కదిలించాడు.

'ఇలా ఎంతకాల ముంటావురా మధూ! లేత వయస్సే కదా నీది? ఆ పసివాడి కోసమైనా మళ్ళీ పెళ్ళిచేసుకోరా'

మౌనంగ నాగదికేసినడిచాను. ఆరాత్రి ఆలోచనలలో నిద్రలేదు. హృదయంలో ఏవేవో భావాలు అల్లల్లాగ చెలరేగసాగాయి.

(తరువాయి 25 వ పేజీలో)

## వసంత

(14 వ పేజీ తరువాయి)

అవ్యక్తంగా ఏవేవో ఆలోచనలు సుడులు తిరిగాయి, మళ్ళీ వివాహం చేసికొని వసంత స్థానాన్ని మరోవ్యక్తి కివ్వడమా? హృదయం అయిష్టంగా మూలిగింది తనలో వసంతకి తప్ప మరెవ్వరికీ స్థానంలేదంది.

మర్నాడు నా నిర్ణయాన్ని అమ్మతో చెప్పేశాను. నా బాధను అర్థం చేసుకున్నారు కాబోలు నాన్న మళ్ళీ ఆ విషయం కదపలేదు. పసివాడిలో వసంతి ప్రతిరూపం చూసుకొంటూ ఓ రకమైన సంతృప్తితో కాలం వెళ్ళబుచ్చుతున్నాను.

ఆలోచనా స్రవంతిలోంచి బాహ్యస్మృతిలో కొచ్చేసరికి చీకటి పడుతోంది. మెల్లగాలేచి ఇంటివైపు బయలు దేరాను.

పిల్లవాడు ఉయ్యాలలో ఊగుతున్నాడు. ఉయ్యాల దగ్గర కెళ్ళాను, వాడి చిన్నారి పెదవులమీద చిరునవ్వు నాట్యం చేస్తోంది. ఆ ముఖం అచ్చం వసంత ముఖంలాగే ఉంది.

గదిలోకెళ్ళాను. టేబిల్ వద్ద కెళ్ళి దాని మీదున్న పూలదండ అందుకొని ఎదురుగా గోడమీద వేలాడుతూన్న వసంతి ఫోటోకి తగిలించాను. చెమ్మగిల్లిన కళ్ళలోంచి ఓ అశ్రుబిందువు రాలి నేలమీద పడింది. అలవాటు పడినట్లుగా ఆ పృథివి ఆ బిందువును తన హృదయంలో దాచుకొంది.

—o—

## నవ్వనా? ఏడ్వనా?

(18 వ పేజీ తరువాయి)

చేయవలసి వచ్చింది. అయినా లాభంలేక పోయిందే!" అని విచారిస్తున్నాడు.

అప్లికేషను ఇచ్చేటప్పుడు అతనికి ముఖంలో నుండి ఆశా కిరణాలు తొంగి చూస్తూ కన్పించాయి. తనేముందు వాడవిన్నీ, తన కంటే ముందు ఇంకెవ్వరూ ఇచ్చే అవకాశం లేదనిన్నీ అతడు ఆశించాడు. దానికి తోడు ఆయనతో పరిచయం ఉన్న నా వంటి మిత్రుడు దొరికినందుకు మరీ సంతోషించాడు. కాని లాభం శూన్యం.

లోకంలోని మనుష్యులు, మనస్తత్వాలూ చూస్తే నా కాశ్చర్యం వేసింది. ఆయన మరణించి రెండు గంటలన్నా పూర్తికా లేదు, కాని ఆయన జాగా పూర్తయి పోయింది, కొత్తవాళ్ళు భర్తీ అయ్యేరు. ఇంకా నయం, ఆయన జబ్బుగా ఉండగానే అప్లికేషన్లు దాఖలు చెయ్యలేదు, అంచేత లోకంలోని మనుష్యులు స్వార్థపరులేకాని, ఆయన చావకుండా అప్లికేషను దాఖలు చేసే అంత నీచులు కాలేదు. దానికి కొంచెం సంతోషించాలి. ఇదంతా చూస్తూ ఉంటే నా మదిలో మరొక మారు ఈ ప్రశ్న ఉదయించింది. "నవ్వనా? ఏడ్వనా?"

(హిందీ మాతృక ఆధారంగా)

## ఆకాశవాణి

(17వ పేజీ తరువాయి)

ఇంజనీరింగు ప్యాసై ఉద్యోగం చేసుకుంటూ ఉంటూ ఉండగా తండ్రి లంచగొండితనం తెలుసుకొని ఉద్యోగానికి సెలవో రాజీనామాయో పెట్టి, పుట్టింటికొచ్చి బండివాడికి రూపాయిప్పించి స్నానంచేసి కాఫీ త్రాగి, నాన్నగారు సి. ఐ. డీ పాలు గాక నాన్నా నాన్నా అని అంగలార్చే స్త్రీ పాత్ర ఈలాటి నాటికలో తప్ప మరెక్కడా మచ్చుకైనా కనిపించదు. ఇతివృత్తం సన్నివేశాలు, సంభాషణ పాత్ర పోషణ ఏదీ కూడా నాటకం అనిపించుకునే స్థాయికి రాలేదు, నటన బాగుంది.

## కవల పిల్లలు

(18 వ పేజీ తరువాయి)

పిల్లలు పుడతారన్నమాట" అన్నాడు నవ్వుతూ.

"నేనూ అదే అనుకుంటున్నాను మూడు తలలుపోయి, నాలుగు తలలు ఏర్పడ్డయ్యాని" అన్నది సుందరికూడా నవ్వి

"అందుకే శాస్త్ర సమ్మతంగా....."

"ఇంకా చాలించండి మీకబుర్లు మీరును పెద్దవాళ్ళయినకొద్దీ...." అన్నది చిలిపిగా నవ్వుతూ.

సుందరి చెయ్యి పట్టుకుని పెదవులు స్పృశించబోయాడు మోహన్ రావు. అంతలోనే కవలపిల్లలు క్యారు మన్నారు.

## సాహిత్యార్ణవం

(18 వ పేజీ తరువాయి)

వర్ణాన్ని చిత్రించి, ఒక పది సమావేశాలు సాధించలేని ప్రయోజనాన్ని సాధించారు. రవీంద్రుని స్మృతి, వారి కీర్తి చిరకాలం ఉండిపోయే కృషి చేశారు.

శ్రీ అబ్బూరి గోపాల కృష్ణగారికి మా అభినందనలు.


భయపడకండి

పోలియో అను పిలువబడు స్నాయువాతం చూసి భయపడకండి.

ఆయుర్వేద పద్ధతులలో గ్యారంటిగా కుదర్చ గలం.

ఇప్పటికే ఎన్నో కేసులు కుదిర్చాం.

వివరములకు :

శ్రీ లక్ష్మీ నృసింహ
ఆయుర్వేద వైద్యశాల
మచిలీపట్నం.